సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 19 । నవంబర్ । 2023



ఈవీఎం-విశేషాలు ..
సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం వరకు మార్పులు తెచ్చింది. 10లో▸



చింతగూడలో ఐటీ సోదాలు
గుడిహత్నూర్ మండలం చింతగూడలో ఐటీ అధికారుల సోదాలు శనివారం సంచలనం రేపాయి. తమ ఇళ్లలో సోదాలు నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/18.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం, వీవీ ప్యాట్ల ర్యాండమైజేషన్



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు జీబీ పాటిల్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో వినియోగించనున్న ఈవీఎం, వీవీప్యాట్ల ర్యాండమైజేషన్‌ను జిల్లా కేంద్రంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పోటీలో నిలిచిన అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో చేపట్టిన ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు గణేశ్ బాపూరావు పాటిల్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి బి.స్రవంతి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

బోథ్‌లో..



ర్యాండమైజేషన్ నిర్వహిస్తున్న అధికారులు

బోథ్: నియోజకవర్గ కేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ర్యాండమైజేషన్ శనివారం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు జీబీ పాటిల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్

ఎదులాపురం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాల నం.2లో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు, గృహహింస, బాలల హక్కులు, పోక్సో తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి డాక్టర్ పి.శివరామ్ ప్రసాద్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో..
ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారత, సఖి కేంద్రం ఆదిలాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ యశోద, జీసీడీవో చాయ, సఖి కేంద్రం సోషల్ కౌన్సెలర్ లావణ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ది బెస్ట్ టీం ఇండియా



తలపై ప్రపంచ కప్ నమూనాతో అభిమాని



- నేడే వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్
- వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఈసారి కప్ మనదే అంటున్న అభిమానులు

ఆదిలాబాద్: ఐసీసీ మెన్స్ క్రికెట్ వన్డే వరల్డ్ కప్–2023 తుది సమరానికి సమయం ఆసన్నమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ క్రికెట్ స్టేడియంలో నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియాతో ఆస్ట్రేలియా తలపడనుంది. మెగా టోర్నీలో భారత్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగి లీగ్ మ్యాచ్ నుంచి ఫైనల్ వరకు ఓటమి లేకుండా అద్భుత ప్రదర్శన ను కనబరిచింది. జట్టులోని కీలక ఆటగాళ్లు ఫామ్‌లో ఉండడంతో ఈసారి ప్రపంచ విజేతగా రోహిత్ సేన నిలుస్తుందని సగటు క్రికెట్ అభిమాని ఆశిస్తున్నారు. ఫైనల్ సమరాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పలు హోటళ్లు, టీసెంటర్స్, బార్లు, రెస్టారెంట్లలో అభిమానులు, ప్రేక్షకులు మ్యాచ్‌ను చూసేందుకు పెద్ద పెద్ద స్క్రీన్లను ఇప్పటికే సిద్ధం చేశారు. పలువురు అభిమానులు ప్రపంచ కప్ నమూనాను తలపై కత్తిరించుకొని తమ అభిమానాన్ని చాటుకున్నారు. క్రికెట్ వరల్డ్‌కప్ నేపథ్యంలో పలువురి అభిప్రాయాలు..



మన జట్టు బలంగా ఉంది..



లీగ్ మ్యాచ్‌ల్లో టీమిండియా అద్భుతంగా ఆడింది. సమష్టి పోరాటంతో సంపూర్ణ విజయాలను నమోదు చేసుకుని ఫైనల్‌కు దూసుకువచ్చింది. జట్టులోని ఆటగాళ్లంతా మంచి ఫామ్‌లో ఉన్నారు. టాప్‌ఆర్డర్ అటాకింగ్ గేమ్‌తో విజయ అవకాశాలను పెంచుతున్నారు. ఆసీస్‌తో పోలిస్తే టీమిండియా మరింత బలంగా ఉంది. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే విజయం మనదే.
– సతీశ్, సీనియర్ క్రికెటర్

కోహ్లి రాణిస్తే కప్ పక్కా....




కోహ్లి ఆటను చూసి క్రికెట్‌పై ఆసక్తి, అభిమానం పెరిగింది. అప్పటి నుంచి క్రికెట్లో శిక్షణ తీసుకుంటున్నాను. ప్రస్తుతం జరుగుతున్న వరల్డ్‌కప్‌లో ప్రతీ మ్యాచ్ వదలకుండా చూస్తున్నాను. అన్ని మ్యాచ్‌లలో కోహ్లి తనదైన శైలిలో ఆడుతున్నాడు. ఫైనల్లోనూ రాణిస్తే మనం ఈసారి కప్ సాధించడం పక్కా.
– సూర్య, జూనియర్ క్రికెటర్, ఆదిలాబాద్

విజయావకాశాలు మనకే ఎక్కువ



టీమిండియాలో ప్రస్తుతం అందరూ మంచి ప్రదర్శన చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్ని విభాగాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం టీమిండియా, ఆస్ట్రేలియా జట్లకు 60:40 నిష్పత్తిలో విజయ అవకాశాలున్నాయి.
– గజేంద్ర పటాస్కర్, క్రికెట్ కోచ్, ఆదిలాబాద్

పార్టీలు.. మేనిఫెస్టోలు



- సంక్షేమ మంత్రాన్ని జపిస్తూ..
- మూడు ప్రధాన పార్టీల ఎన్నికల హామీ పత్రాలు
- 'కేసీఆర్ భరోసా'తో బీఆర్ఎస్.. 'అభయహస్తం'తో కాంగ్రెస్
- 'సకల జనుల సౌభాగ్య తెలంగాణ గ్యారంటీ' తో బీజేపీ ప్రజల ముందుకు

మిగిలింది కొద్ది రోజులే..
ప్రచారానికి మరికొద్ది రోజుల సమయం మాత్రమే మిగిలింది. ఈ నెల 30న పోలింగ్ ఉండగా దానికి 48 గంటల ముందుగానే ప్రచారం పరిసమాప్తం అవుతుంది. బీఆర్ఎస్ ఇప్పటికే తమ మేనిఫెస్టోపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇక కాంగ్రెస్, బీజేపీలు తమ హామీ పత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి ఉంది. ఇప్పటి వరకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై ప్రచారంలో ముందుకు తీసుకెళ్లారు. ఇక బీజేపీ పరంగా ప్రధానమంత్రి మోదీ రాష్ట్ర పర్యటనలో భాగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై హామీలు ఇచ్చారు. అలాగే ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్ సభ ద్వారా ఆయా వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. తాజాగా కాంగ్రెస్, బీజేపీలకు సంబంధించి హామీ పత్రాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయా పార్టీలు సిద్ధం అవుతున్నాయి.

జంగ్ తెలంగాణ

సాక్షి,ఆదిలాబాద్: మూడు ప్రధాన పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలు ప్రజల ముందుకు వచ్చాయి. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఆ హామీలను అమలు చేస్తామని చెబుతున్నాయి. నెల క్రితమే బీఆర్ఎస్ కేసీఆర్ భరోసా అంటూ ప్రకటించగా.. శుక్రవారం కాంగ్రెస్ అభయహస్తం పేరిట, శనివారం బీజేపీ సకల జనుల సౌభాగ్య తెలంగాణ గ్యారంటీ పేరిట మేనిఫెస్టోలను విడుదల చేశాయి. ఇప్పటి వరకు ఒక విధంగా సాగిన ప్రచారం ఈ మిగిలిన రోజుల్లో హామీలను వివరిస్తూ జోరుగా సాగే అవకాశం ఉంది.

హామీ పత్రాలు ఇలా..
పార్టీ అభ్యర్థులను ముందుగా ఖరారు చేయడంతో పాటు బీఆర్ఎస్ నెల క్రితమే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా హైదరాబాద్‌లో మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులు ప్రచారంలో కేసీఆర్ భరోసా పేరిట వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. సామాజిక పింఛన్లను విడతల వారీగా రూ.5 వేలకు పెంచడం, కేసీఆర్ బీమా.. ప్రతి ఇంటికి ధీమా, దళితబంధును కొనసాగించడం, రైతుబంధు రూ.10 వేల నుంచి విడుతల వారీగా రూ.16 వేల వరకు పెంచడం వంటి పథకాలను ఇందులో ప్రకటించారు. ఇక కాంగ్రెస్ మేనిఫెస్టోను శుక్రవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆరు గ్యారంటీలు, రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ డిక్లరేషన్‌లతో పాటు అదనంగా వివిధ సంక్షేమ పథకాలను ఇందులో ప్రకటించారు. ధరణికి బదులు భూమాత పోర్టల్ తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీకి జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ పథకం పరిమితి రూ.10 లక్షల వరకు పెంపు, మహిళలకు, ఆడ పిల్లలకు ఆర్థిక సాయం, కులాలు–రిజర్వేషన్లు వంటి అంశాలను ప్రస్తావించారు. ఇక శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లో బీజేపీ మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ధరణి స్థానంలో మీ భూమి వ్యవస్థ, కేంద్ర పథకాల అమలుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ, మత ప్రతిపాదికన రిజర్వేషన్ల తొలగింపు, బీసీ, ఎస్టీ, ఎస్సీలకు రిజర్వేషన్లు, తెలంగాణ ముఖ్యమంత్రిగా బీసీ, వివిధ చట్టాలను ఏకీకృతం చేస్తూ ఉమ్మడి పౌరస్మృతి, ఎస్సీల వర్గీకరణకు సహకారం, బీఆర్ఎస్ అవినీతిపై విచారణ కమిటీ, అర్హులైన పేదలందరికీ ఇళ్లు వంటివి ప్రకటించారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తిచేయాలి



ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పరిశీలకులు, కలెక్టర్

- రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్, దీపక్ మిశ్రా

కైలాస్‌నగర్: ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో తగు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్ వి.నాయక్, రాష్ట్ర పోలీస్ పరిశీలకులు దీపక్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో శనివారం వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. పాస్‌లు ఉన్న వారిని మినహా ఇతరులెవరినీ పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించకూడదన్నారు. బందోబస్తు విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్లనూ అనుమతించరాదన్నారు. పోలింగ్ స్టేషన్ల సమీపంలో ఓటర్లను ఒత్తిడి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించాలని ఆదేశించారు. తొలుత జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో 25 మంది, బోథ్ నియోజకవర్గంలో 10మంది బరిలో ఉన్నట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో 2,40,326 మంది ఓటర్లకు గాను 290 పోలింగ్ కేంద్రాలు, బోథ్ లో 2,08,048 మంది ఓటర్లకు గాను 302 పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. 80 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు 551, దివ్యాంగ ఓటర్లు 214 మంది ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారి ఇళ్ల వద్దకే బృందాలను పంపించి ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. 10 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేయనున్నామని, ఇప్పటికే ఈవీఎంలు, పోలింగ్ సిబ్బంది కేటాయింపులకు సంబంధించిన ర్యాండమైజేషన్ పూర్తయిందన్నారు. సువిధ యాప్‌లో దరఖాస్తులను, సీ–విజిల్ యాప్ లో ఫిర్యాదులను, ఎంసీఎంసీ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సంబంధించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కాగా అంతకు ముందు జిల్లాకు చేరుకున్న వారికి కలెక్టర్, ఎస్పీలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో, రిటర్నింగ్ అధికారులు చాహత్ బాజ్‌పాయ్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘించిన ముగ్గురిపై కేసు

ఆదిలాబాదురూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని దస్నాపూర్‌లో, కేసీబీ గార్డెన్ ఏరియాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. దస్నాపూర్‌కు చెందిన బాలాజీ స్వీట్స్ యజమాని సునీల్ కుమార్, జనతా దర్బార్ హోటల్ యజమాని మషీర్ మీర్జా, కేసీబీ గార్డెన్ ఏరియాలో సాండ్స్ కేసీ యజమాని భరత్, అభిజిత్ శుక్రవారం రాత్రి 10 గంటల తర్వాత షాపులు కొనసాగించడంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ ఇద్దరూ.. అభివృద్ధి ప్రదాతలు

- సీసీఐ, స్పిన్నింగ్‌మిల్లు, సాత్నాల ప్రాజెక్ట్ సాధకులు
- సీఆర్ఆర్, మసూద్ అహ్మద్‌ల ఘనత
- ఆదిలాబాద్ నియోజకవర్గ వాసుల మదిలో చెరగని ముద్ర

కైలాస్‌నగర్: ఎమ్మెల్యేలుగా ఎంతో మంది నాయకులు పనిచేస్తుంటారు. అందులో కొంతమంది తమ పనితీరు, చేసిన అభివృద్ధితో ప్రజల్లో చెరగని ముద్ర వేసుకుంటారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చ జరిగితే అలాంటి నాయకులు ప్రజల మనస్సుల్లో స్ఫురణకు వస్తారు. ఎన్నికల్లో స్వతంత్రులుగా నిలిచి మరి గెలుపొందారంటే వారు చేసిన అభివృద్ధితోనే ప్రజల ఆదరణ పొందారనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదు. ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఐకాన్‌గా చెప్పుకునే సాత్నాల ప్రాజెక్ట్, స్పిన్నింగ్ మిల్లు, సిమెంట్ ఫ్యాక్టరీలు దివంగత ఎమ్మెల్యేలు మసూద్ అహ్మద్, చిల్కూరి రాంచంద్రారెడ్డి హయాంలో ఏర్పడ్డాయి. వాటిని ఏర్పాటు చేసింది ప్రభుత్వాలే అయినప్పటికీ వాటి సాధనకు వారు చేసిన కృషి మరువలేనిది.



సి.రాంచంద్రారెడ్డి

మసూద్ హయాంలో.. సాత్నాల
జైనథ్ మండలం కాన్ప గ్రామం వద్ద 24వేల ఎకరాలకు సాగునీరందించాలనే ఉద్దేశంతో నిర్మించిన సాత్నాల ప్రాజెక్ట్ ఆదిలాబాద్ నాలుగోఎమ్మెల్యే మసూద్ అహ్మద్ కాలంలో ప్రారంభమైంది. ప్రాజెక్ట్ రెండు కెనాల్స్ ద్వారా ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జైనథ్, బేల, ఆదిలాబాద్ మండలాల్లోని 35 గ్రామాల రైతులకు సాగునీరందించే ఈ ప్రాజెక్ట్ 1977లో ప్రారంభమైంది. రెండు పంటలు పండించేందుకు వీలుగా నిర్మించిన ఈ ప్రాజెక్ట్ ఘనతను మసూద్ దక్కించుకున్నారు. ఎమ్మెల్యేగా ఆయన అందించిన సేవలకు గాను ఆయన తదనంతరం ఆయన కుమారుడు జావీద్ అహ్మద్ కుర్షీద్ ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు.



సాత్నాల ప్రాజెక్ట్

స్పిన్నింగ్‌మిల్లు కూడా ..



స్పిన్నింగ్ మిల్లు

పత్తి సాగుకు ఆసియాలోనే ప్రఖ్యాతి గాంచిన ఆదిలాబాద్‌లో పత్తి ఆధారిత పరిశ్రమగా ఏర్పాటైన స్పిన్నింగ్ మిల్లు కూడా మాజీ మంత్రి రాంచంద్రారెడ్డి హయాంలోనే జరిగింది. 1980లో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పరంగా ఈ మిల్లును ఏర్పాటు చేశారు. దీని ద్వారా సుమారు 500 మందికి పైగా కార్మికులు ఉపాధి పొందారు. జిల్లా అభివృద్ధికి ఈ పరిశ్రమ తోడ్పడింది. అయితే ఈ పరిశ్రమను 1999 అక్టోబర్ 26న అప్పటి ప్రభుత్వం వేలం ద్వారా విక్రయించేసింది. ప్రస్తుతం ప్రైవేట్ యాజమాన్యంలో ఈ పరిశ్రమ నడుస్తోంది. స్పిన్నింగ్ మిల్లును ప్రభుత్వమే ఏర్పాటు చేసినప్పటికీ సీఆర్ఆర్ హయాంలోనే ఏర్పాటైన పరిశ్రమగా ఆయన ఘనత దక్కించుకున్నారు. వీటితో పాటు పేదల వర ప్రదాయనిగా పిలుచుకునే జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ఏర్పాటు సైతం సీఆర్ఆర్ హయాంలోనే ఏర్పాటవడం గమనార్హం. అలాగే తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్ట్ నిర్మాణాం సైతం సీఆర్ఆర్ కృషి ఫలితంగానే జరిగింది. ఇలా నియోజకవర్గంలో పరిశ్రమలు, ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం ఆయన చేసిన సేవలకు గాను మరోసారి ఇండిపెండెంట్‌గా, రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొంది ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు.

సీఆర్ఆర్ హయాంలోనే సీసీఐ ..



సీసీఐ ఫ్యాక్టరీ

ఒకప్పుడు ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా నిలిచిన జిల్లా కేంద్రంలోని సిమెంట్ ఫ్యాక్టరీ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమకు 1978–1979లో భూమిపూజ జరిగింది. 1984లో సిమెంట్ ఉత్పత్తిని ప్రారంభించి 1990వ సంవత్సరం వరకు విక్రయాలు జరిపిన ఈ పరిశ్రమతో ప్రత్యక్షంగా వందలాది మంది, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందారు. అప్పటి ఎమ్మెల్యే చిల్కూరి రాంచంద్రారెడ్డి హయాంలో ఈ పరిశ్రమ ప్రారంభమైంది. ఆదిలాబాద్ నియోజకవర్గ ఐదో ఎమ్మెల్యేగా స్వతంత్ర్య అభ్యర్థిగా గెలిచిన ఆయన కాలంలో ఈ పరిశ్రమ స్థాపించబడింది. కొన్నేళ్లపాటే ఈ పరిశ్రమ నడిచినప్పటికీ దీని ద్వారా జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కినట్లైంది.

FORMAT C-7
(FOR POLITICAL PARTIES TO PUBLISH IN THE NEWSPAPERS, SOCIAL MEDIA PALTFORMS & WEBSITE OF THE PARTY)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates (As per the Commission's direction issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petitioner (C) no. 2192 of 2018 in W.P. (A.no. 536 of 2011).

Name of political party : DARMA SAMAJ PARTY
Name of the Election : LEGISLATIVE ASSEMBLY
Name of state/UT : TELANGANA STATE
(1) Name of the Constituency : 07 ADILABAD ASSEMBLY CONSTITUENCY
Name of the Candidate : AGGIMALLA GANESH

SL.No.			
1.	Criminal antecedents		
	a.	Name of the Offences	Sec. 353, 447, 294-B, R/w 149 of IPC & Section of 3 of PDPP Act. Cr. No. 21/2022 Police Station Talamadugu
	b.	Case No.	CC No. 373/2022
	c.	Name of the Court	Spl. JFCM (PCR) Court, Adilabad
	d.	Whether charges have been framed or not (YES/NO)	No
	e.	Date of conviction, if any	No
	f.	Details of punishment undergone, if any	No
	g.	Any other information reqired to be given	Nil
2.		The reasons for the selection of the candidate Selection shall be with reference to the qualifications achievements and merit of the candidate, and not mere 'winnability' at the polls (not more than 100 words)	He is Well - Known Public Leader

Sd/- **AGGIMALLA GANESH**
07 ADILABAD ASSEMBLY CONSTITUENCY

క్లుప్తంగా

ఎన్నికలు బహిష్కరించిన భగవాన్‌పూర్ వాసులు



ఫ్లెక్సీ చూపుతున్న గ్రామస్తులు

తాంసి(బోథ్): తమ గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టే వరకూ ఎన్నికల్లో ఓటు వేయమని, ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గిరిజనులు తీర్మానం చేశారు. తమ గ్రామానికి రోడ్డు లేక అనేక ఏళ్లుగా అవస్థలు పడుతున్నామని వాపోయారు. ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు గురువారం అధికారులకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. తమ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి ఎవరూ రావద్దని శనివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న తరుణ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థి తరుణ్ జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. జమ్మూ కాశ్మీర్‌లోని తావీలో ఈనెల 14 నుంచి 18 వరకు నిర్వహించిన 67వ జాతీయ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల్లో జూడో క్రీడలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. తెలంగాణ నుంచి మొత్తం 14 మంది పోటీలకు ప్రాతినిధ్యం వహించగా తరుణ్ పతకం సాధించడం విశేషం. అండర్ 14 విభాగంలో మైనస్ 50 కేజీల ఈవెంట్లో గోల్డ్ మెడల్ సాధించాడని కోచ్ రాజు తెలిపారు. సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, డెప్యూటీ డైరెక్టర్ ధనలక్ష్మి, జేఎఫ్ఐ జనరల్ సెక్రెటరీ జనార్దన్‌రెడ్డి, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ కాంతారావ్ అభినందనలు తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్టు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం గంజాయి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు విశ్వనాథ్ పేటకు చెందిన అబ్దుల్ ముక్తార్‌ను తనిఖీ చేయగా అతని వద్ద 50 గ్రాముల గంజాయి దొరికింది. స్థానిక యువకులకు చిన్న చిన్న పొట్లాలు చేసి రూ.100కు ఒకటి చొప్పున అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పశుగ్రాసంగా మారిన పత్తి పంట

తాంసి: ఈ ఏడాది సాగు చేసిన పత్తి పంట అనుకున్నంత దిగుబడి రాక పెట్టుబడి కూడా వెళ్లని పరిస్థితుల్లో పలువురు రైతులు పశువులకు మేతగా వదిలేస్తున్నారు. తాంసి మండలంలోని వడ్డాడి గ్రామానికి చెందిన కేమ పొచ్చన్న తనకున్న 2.5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా కేవలం పది క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. కనీసం పెట్టుబడి సైతం రాకపోవడంతో శనివారం పత్తిచేలలో పశువులను వదిలేశాడు. పత్తిని తొలగించి ఇతర పంట ఏదైనా సాగు చేయాలని పశువులను వదిలేసినట్లు రైతు తెలిపాడు.

ఈవీఎం-విశేషాలు..

- పారదర్శక ఓటింగ్‌కు భరోసా
- మొదటిసారి 1982లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో వినియోగం

జంగ్ తెలంగాణ

భైంసాటౌన్(ముథోల్): సమర్థవంత ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం అనేక సంస్కరణలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్యాలెట్ బాక్స్ మొదలు ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్) వరకు ఓటింగ్ విధానంలో మార్పులు తెచ్చింది. ఈవీఎం, వీవీప్యాట్, నోటా లాంటి నూతన విధానాలతో పారదర్శక ఓటింగ్‌కు భరోసానిస్తోంది. 1999 ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాల ముద్రణకు 7,700 టన్నుల కాగితం వాడారు. 2009 సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ కోసం ఈవీఎం వాడడంతో 10 వేల టన్నుల కాగితం మిగిలింది. ఈవీఎంలను మొదటిసారిగా 1982లో కేరళ రాష్ట్రంలోని పర్వూర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించారు. ఈవీఎంలపై నెలకొన్న సందేహాలకు నివృత్తిగా పలు సమాధానాలను ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో పొందుపర్చింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం విశేషాలపై కథనం..



ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఈవీఎం)

ఈవీఎం అంటే?

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్. ఇది ఎన్నికల్లో పోలైన ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో రికార్డు చేయడంతో పాటు లెక్కించే పరికరం. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు జతగా వీవీప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్) ఉంటుంది.

రవాణా సులభం..

బ్యాలెట్ బాక్సులతో పోలిస్తే ఈవీఎంల రవాణ చాలా సులభం. తేలికంగా, పోర్టబుల్‌గా ఉండడంతో దూరంగా, రోడ్డు సౌకర్యం లేనిప్రాంతాలకు సైతం వీటిని సులభంగా తరలించవచ్చు.

గరిష్టంగా అభ్యర్థుల సంఖ్య, వేసే ఓట్లు..

ఈవీఎం బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో పాటు 15 మంది అభ్యర్థుల పేర్లు మాత్రమే ఉంటాయి. ఒకవేళ అంతకంటే ఎక్కువ అభ్యర్థులు బరిలో ఉంటే మరో బ్యాలెట్ యూనిట్‌ను వినియోగించాల్సి ఉంటుంది. ఇలా ఒక ఈవీఎంకు 24 బ్యాలెట్ యూనిట్లు అనుసంధానించవచ్చు. తద్వారా 384 మంది అభ్యర్థుల వరకు సేవలు అందిస్తుంది. ఇక ఓట్ల విషయానికి వస్తే గరిష్టంగా 2 వేల ఓట్లను రికార్డు చేస్తుంది. కానీ ఎన్నికల్లో సాధారణంగా 1500 ఓట్లను నమోదు చేయడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

ఓటు ఎలా వేయవచ్చు?

ఈవీఎం ఓటింగ్ విధానంలో కంట్రోల్ యూనిట్ ప్రిసైడింగ్ అధికారి వద్ద, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్‌లో ఉంటుంది. బ్యాలెట్ యూనిట్‌పై ఓటరు తనకు నచ్చిన అభ్యర్థి గుర్తుకు ఎదురుగా ఉన్న బ్లూబటన్ నొక్కగానే ఎరుపురంగు లైట్ మెరుస్తుంది. ఎంపిక చేసుకున్న అభ్యర్థి సీరియల్ నంబర్, పేరు, గుర్తు చూపించే పేపర్ స్లిప్ వీవీప్యాట్ విండో ద్వారా సుమారు 7 సెకన్ల పాటు కనిపించి డ్రాప్‌బాక్స్‌లో పడగానే కొద్దిసేపు బీప్ అనే శబ్దం వస్తుంది. దీంతో ఓటు నమోదైందని తెలుసుకోవచ్చు.

విద్యుత్ లేని ప్రాంతాల్లో..

ఈవీఎంలకు విద్యుత్ సరఫరా అవసరం లేదు. ఈవీఎం, వీవీప్యాట్‌లకు సొంతంగా బ్యాటరీ/పవర్-ప్యాక్ సౌకర్యం ఉండడంతో విద్యుత్ సరఫరా లేని ప్రాంతాల్లో సైతం వీటిని వినియోగించవచ్చు.

ఈవీఎం మొరాయిస్తే..

పోలింగ్ సమయంలో బ్యాలెట్, కంట్రోల్ యూనిట్ క్రమం తప్పితే బ్యాలట్, కంట్రోల్ యూనిట్‌తో పాటు వీవీప్యాట్‌తో కూడిన కొత్త సెట్ ఏర్పాటు చేస్తారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రిజర్వ్ దశ నుంచి పనిచేయని దశ వరకు నమోదైన ఓట్లు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ బ్యాలెట్ స్లిప్‌లు కంపార్ట్‌మెంట్ మెమరీలో భద్రంగా ఉంటాయి. వీవీప్యాట్ మాత్రమే పనిచేయకపోతే కంట్రోల్ యూనిట్‌లో నమోదైన ఓట్లు దాని మెమరీలో భద్రంగా ఉంటాయి. దీంతో రిజర్వ్ మెషిన్ల నుంచి పనిచేయని వీవీప్యాట్ తొలగించి మరొకటి ఏర్పాటు చేసిన తర్వాత పోలింగ్ తిరిగి ప్రారంభిస్తారు. ఏదైనా సాంకేతిక కారణాలతో కంట్రోల్ యూనిట్‌లలో నమోదైన ఓట్లను నిర్ధారించకపోతే కంట్రోల్ యూనిట్ వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తారు.

నిర్ధారించుకున్న తర్వాతే పోలింగ్..

పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్‌లో రిజల్ట్ బటన్‌ను నొక్కి ఇప్పటికే 'దాచిన' ఓట్లేవీ నమోదు కాలేదని ప్రిసైడింగ్ అధికారి హాజరైన పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శిస్తారు. వీవీప్యాట్ డ్రాప్‌బాక్స్ తెరిచి ఖాళీగా ఉందని చూపుతారు. వారి సమక్షంలో కనీసం 50 ఓట్లతో మాక్ పోల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆ ఫలితాన్ని క్లియర్ చేసి అసలు పోల్ ప్రారంభించే ముందు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌కు సీలు వేస్తారు.

ఓటరు ఫిర్యాదు చేయవచ్చు

ఓటరు ఓటును నమోదు చేసిన తర్వాత వీవీప్యాట్‌లో కనిపించే పేపర్ స్లిప్‌లో ఓటు వేసిన అభ్యర్థి కాకుండా వేరే అభ్యర్థి పేరు, గుర్తు వచ్చినట్లయితే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిజమని తేలితే ఆ ఓటింగ్ యంత్రంలో తరువాతి ఓట్ల నమోదును నిలిపివేసి రిటర్నింగ్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటారు.

పోలైన ఓట్ల సంఖ్య ఇలా తెలుసుకోవచ్చు..

ఈవీఎం కంట్రోల్ యూనిట్‌లో ఫలితం బటన్‌తో పాటు, టోటల్ బటన్ ఉంటుంది. పోల్ సమయంలో ఎప్పుడైనా ఈ బటన్ నొక్కితే అప్పటి వరకు పోలైన మొత్తం ఓట్ల సంఖ్య తెలుస్తుంది. పోలింగ్ ముగియగానే క్లోజ్ బటన్ నొక్కితే మెషిన్ ఇకపై ఓట్లను అంగీకరించదు.

ఈవీఎంల భద్రత..

పోలింగ్ తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో సెక్యూరిటీ బలగాల పహారాలో భద్రపరుస్తారు. అభ్యర్థులు నియమించిన ఏజెంట్లు కౌంటింగ్ వరకు ఈవీఎంలను 24 గంటలూ చూసేందుకు అనుమతిస్తారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లకు తాళాలు వేసి ఎన్నికల అధికారులతో పాటు అభ్యర్థులు లేదా వారి ప్రతినిధుల సంతకాలతో సీలు వేస్తారు.

కౌంటింగ్ డే..

కౌంటింగ్ రోజున అభ్యర్థులు/వారి ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారి, ఎన్నికల సంఘం పరిశీలకుల సమక్షంలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తెరుస్తారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు పూర్తయిన తర్వాత, వీవీప్యాట్ స్లిప్‌లను బయటకు తీసి, అభ్యర్థులు/వారి ప్రతినిధుల సమక్షంలో నల్లటి కవరులో భద్రపరుస్తారు.

స్వీట్ నీకు.. అమ్మానాన్నల ఓటు నాకు..



'చిన్నా.. ఇదిగో ఈ స్వీట్ నీకు.. మీ అమ్మానాన్నల ఓటు మాత్రం నాకే..' అన్నట్లుగా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఓ చిన్నారికి ఇలా స్వీట్ తినిపించారు. సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్‌లో శనివారం ప్రచారం నిర్వహిస్తుండగా స్వీట్ తీసుకుని వచ్చిన చిన్నారికి మంత్రి ఇలా తినిపించడం ఆకట్టుకుంది.
- నిర్మల్

చింతగూడలో ఐటీ అధికారుల సోదాలు

- ఎన్నికల నగదు డంప్ ఉందనే సమాచారంతో..



సోదా చేస్తున్న ఐటీ, ఎఫ్ఎస్టీ అధికారులు

గుడిహత్నూర్(బోథ్): ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలంలోని చింతగూడలో ఐటీ అధికారుల సోదాలు శనివారం హల్‌చల్ చేశాయి. తమ ఇళ్లలో సోదాలు నిర్వహిస్తుండడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. ఎన్నికల నేపథ్యంలో పంపిణీ చేసేందుకు గాను గ్రామంలో భారీగా నగదు డంప్ చేశారని సమాచారంతో ఐటీ అధికారులు గ్రామానికి చేరుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసుల సహకారంతో ప్రతీ ఇంటిని జల్లెడ పట్టారు. అయితే ఈ సోదాల్లో ఎలాంటి నగదు లభించలేదని అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎస్సై ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పద్ధతితో అధిక దిగుబడి



పల్సికేలో పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

తలమడుగు(బోథ్): అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం తలమడుగు మండలంలోని పల్సి కేలో అధిక సాంద్రతలో పత్తి సాగు చేసిన పంట పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సాంద్రత విధానంలో పత్తి పంట సాగు చేయడం ద్వారా ఎకరాకు ఐదు నుంచి ఎనిమిది క్వింటాళ్ల పత్తి దిగుబడి అధికంగా వస్తుందన్నారు. ఈ విధానంపై పలు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించామన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో మధ్యమధ్యలో ఇతర పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి వస్తుందన్నారు. రైతులు అధిక సాంద్రతపై మొగ్గు చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్, రాజశేఖర్, మోహన్‌దాస్, శివశరణ్, ప్రాజెక్టు ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్, సాయి, మల్లేశ్, రైతులు పాల్గొన్నారు.

నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యం



స్విమ్మింగ్ పోటీలు ప్రారంభిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమని జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శనివారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా జోనల్ స్థాయి అండర్ 14, 17 బాలబాలికల స్విమ్మింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్‌తో శరీరంలోని ప్రతి అవయవానికి వ్యాయామం చేయబడుతుందన్నారు. సమ్మర్‌లోనే అనేక మంది స్విమ్మింగ్ నేర్చుకుంటున్నారని, అనంతరం మానేస్తున్నారన్నారు. రెగ్యులర్‌గా సాధన చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, కోచ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
DIRECT FINAL YEAR
■INTER, GNM, B.Sc, MLT, NURSING, OPTOMETRY, Post Basic, BPT, MPT, BHMS, BNYS, Ph.D(all) (కొన్ని సీట్లు మాత్రమే) సెల్: 7013088197. [W-1229311]

SERVICES
Finance Services
■సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1200958]

OLD AGE HOME
■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

WANTED
■విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■REQUIRED CIVIL CONTRACTORS
IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234 [OA-297]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

వివాహం కావడంలేదని యువకుడు ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

సోన్(నిర్మల్): వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంతోషం రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన పందిరి లింగన్న, పోశాని దంపతుల కుమారుడు రాంచందర్ (32)పెళ్లి సంబంధాలు కుదరడంలేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో బయటకు వెళ్లి గ్రామ శివారులోని వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి



భూమన్న మృతదేహం

లక్ష్మణచాంద(నిర్మల్): ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వడ్యాల్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గురియ భూమన్న (50)పశువుల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అతని భార్య భీమవ్వ చెరువు వద్దకు వెళ్లి చూడగా చెరువులో మృతదేహం తేలియాడి ఉంది. భీమవ్వ ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత



ఇంద్రవెల్లిలో స్వాధీనం చేసుకున్న మద్యం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండల కేంద్రంలో నిచిద్‌దరి ఖానాపూర్ రోడ్ పక్కనే అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న టగ్రే ఇందల్ దుకాణంలో శనివారం పోలీసులు, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడుల్లో రూ.24,200ల విలువైన మద్యం పట్టుబడినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఎదులాపురం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీసీఎస్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయినాథ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్, ఇచ్చోడలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించారు. ఖానాపూర్ కాలనీలో పెండల సంతోష్ వద్ద రూ.3,740 విలువ చేసే 20 మద్యం బాటిళ్లు, ఇచ్చోడలో ఇందల్ సింగ్ అనే బెల్ట్ షాపు నిర్వాహకుని వద్ద రూ. 25,000 విలువ చేసే 212 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేశారు.

ఒకేరోజు మూడు ఆలయాల్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని మచ్చాపూర్‌తాండ, ముత్నూర్‌తాండ, రావుతాండ గ్రామాల్లోని దుర్గామాత ఆలయాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు గ్రామ పెద్దలు ప్రతాప్ సింగ్, గున్వంత్, రాంజీ, జైపాల్ తెలిపారు. అర్ధరాత్రి దాటాక దొంగలు ఒకే రూట్‌లోని కిలో మీటర్ దూరంలో ఉన్న ఈ ఆలయాల్లో చొరబడి రూ.3లక్షల విలువైన ఆభరణాలు అపహరించినట్లు వారు పేర్కొన్నారు. శనివారం ఉదయం గుర్తించి పోలీసులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సై ఇమ్రాన్ సంఘటనా స్థలాలకు చేరుకుని క్లూస్ టీంను వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది రమేశ్, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న బలగాలు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ముందస్తుగా మండలంలోని శ్యాంపూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు డీఎస్పీ నాగేందర్ తెలిపారు. శనివారం పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్నామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రియాంకాగాంధీ సభను జయప్రదం చేయాలి'



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వెడ్మ బొజ్జు

ఖానాపూర్: ఖానాపూర్‌లో ఆదివారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు కోరారు. శనివారం మండలంలోని సుర్జాపూర్ ఎన్టీఆర్ చౌరస్తా ప్రాంతంలో పార్టీ శ్రేణులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. సభకు నియోజకవర్గంలోని 8 మండలాల నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్తు మల్లేశ్, దయానంద్, చిన్నం సత్యం, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, మజీద్, గంగనర్సయ్య, తోట సత్యం, గుగ్లావత్ రాజు, జంగిలి శంకర్, షౌకత్‌పాషా, జహీర్ హైమద్, మాసుల లక్ష్మీరాజం, గంగరాజం, సజ్జు, మీర్జాబేగ్, మైస శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజ్గిలో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ అభ్యర్థి ఐకేరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గ్రామానికి చెందిన బొడ్డు చిన్న మహేందర్, సాయన్న, జక్కుల గంగయ్య, చుక్కల సందీప్, కందెల ప్రసాద్, మహేందర్, చిన్న మల్లయ్య, రాజుల ప్రవీణ్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ప్రచారాన్ని అడ్డుకున్నారన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఇచ్చిన దరఖాస్తు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

'ప్రజల మధ్య విభేదాలు తెస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న నూతన్ కుమార్

ఖానాపూర్: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల మధ్య విభేదాలు తెస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నూతన్‌కుమార్ కోరారు. శనివారం మండలంలోని తర్లపాడ్ గ్రామంలో మాట్లాడారు. మతతత్వ పార్టీని ఓడించి లౌకిక వాదాన్ని ప్రజలు బలపర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, నర్సయ్య, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా గణేశ్‌పూర్‌కు చెందిన కోడిపె రోషన్ (29) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 16న మద్యం మత్తులో గుర్తు తెలియని మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాలిక అపహరణ

ఎదులాపురం: బాలిక అపహరణకు గురైన సంఘటన టుటౌన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలిక (16)ను అదే కాలనీకి చెందిన బాలుడు (17) శుక్రవారం రాత్రి అపహరించాడు. ఈ మేరకు బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.